## క్లుప్తంగా

### బుక్‌రీడర్స్ క్లబ్ ప్రారంభం

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో బుక్ రీడర్స్ క్లబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. లైబ్రేరియన్ వసంత కుమారి మాట్లాడుతూ విద్యార్థులు, యువకులల్లో పఠనాశక్తిని పెంపొందించడం, సాహితీ,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు పలు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవకాశాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మదనపల్లె రూరల్ : పట్టణంలోని 132/33 కే.వి. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధరం తెలిపారు. శుక్రవారం ఈఈ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...మదనపల్లె టౌన్, సీటీఎం, నిమ్మనపల్లె, కురబలకోట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

### అన్నదానం

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం గుడ్ విల్ కంప్యూటర్స్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు పాఠశాలలో చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, గుడ్‌విల్ కంప్యూటర్స్ నిర్వాహకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### మెనూ ప్రకారం భోజనం వడ్డించండి

పెద్దతిప్పసముద్రం: స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని శుక్రవారం రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వ్యక్తిగత మరుగుదొడ్లలో పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు.. ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో నీటి ఎద్దడి కారణంగా రెండు ట్యాంకర్ల నీరు సరఫరా అవుతోందని అదనంగా మరో ట్యాంకర్ నీళ్ళు అవసరమని సిబ్బంది అధికారులకు తెలియజేశారు.

### ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత

కేవీపల్లె : అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీరెడ్డిగారిపల్లెలో «సుపరిపాలన తొలి అడుగు» కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో డ్రోన్లు అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నిక

రామసముద్రం: రామసముద్రం మండలం పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నిక శుక్రవారం ఎంపీడీవో గఫూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రామసముద్రం పంచాయతీ కార్యదర్శి మునస్వామినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చెంబకూరు పంచాయతీ కార్యదర్శిగా రెడ్డిశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కెసి.పల్లి పంచాయతీ కార్యదర్శి మారప్ప, కోశాధికారిగా లతాప్రసన్న, మీడియా ప్రతినిధిగా టి.రెడ్డిశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తామని ఎన్నికైన సభ్యులు పేర్కొన్నారు.

### చెత్త సేకరణను తనిఖీ చేసిన అధికారులు



గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

నిమ్మనపల్లె : మండల కేంద్రంలోని నిమ్మనపల్లెలో శుక్రవారం చెత్తసేకరణ ప్రక్రియను ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డితో కలిసి గ్రామంలోని బస్టాండ్, బజారువీధి, దిగువవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గ్రీన్ అంబాసిడర్లు సమయపాలన పాటించాలన్నారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. అనంతరం స్థానికులకు అవగాహన కల్పిస్తూ కచ్చితంగా ప్రజలందరూ గ్రామపంచాయతీ పంపిణీ చేసిన చెత్త బుట్టలను వినియోగించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బందికి అందించాలన్నారు.

# ఎల్లమ్మ జాతరకు వెళ్లొద్దాం

- మొదలైన జాతర సందడి
- నేటి నుంచి గ్రామదేవత ఎల్లమ్మ తిరునాల
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



జాతరకు ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం

కలికిరి: పట్టణంలో వెలసిన గ్రామ దేవత, భక్తులు కోర్కెలు తీర్చే చల్లని తల్లి ఎల్లమ్మ తిరునాల శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించే జాతరలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని వివరించారు. జాతరలో భాగంగా ఆలయ ఆవరణంలో శనివారం రాత్రి అమ్మవారి హరికథా కాలక్షేపం, జాగరణ జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తేరులో ప్రత్యేక అలంకరణ మధ్య కలికిరి పట్టణంలో ఊరేగింపు, తదుపరి సిద్ధ పూజ, అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులు అమ్మవారికి దీలు, బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే రాత్రికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రంగు రంగుల విద్యుత్‌దీపాలంకరణలతో ఏర్పాటు చేసిన చాందినీ బండ్ల ఊరేగింపు, ప్రదర్శన చేపడతారని, ఆలయ ఆవరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. సోమవారం నుంచి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం, రాత్రి లంకాదహనం, తేరులో పుష్పపల్లకీకి సేవ నిర్వహిస్తామన్నారు. మంగళవారం జరుగు పార్వేట ఉత్సవంతో జాతర ముగుస్తుందని చెప్పారు. ఈ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ధర్మకర్త కోరారు. ఆలయ పరిసరాలలో భక్తుల తోపులాటలు చోటు చేసుకోకుండా ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే జాతరకు విచ్చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు :**

కలికిరి ఎల్లమ్మ జాతర ను పురస్కరించుకుని పీలేరు ఆర్టీసీ డిపో నుంచి 25 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు పీలేరు డీఎం బి.నిర్మల తెలిపారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు పీలేరు-కలికిరి, కలికిరి-కలకడ, సోమల-కలికిరి, మదనపల్లి-కలికిరి, కలికిరి-సదుం మార్గాలలో మొత్తం 25 సర్వీసులను భక్తుల సౌకర్యార్థం నడపటం జరుగుతుందని, భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

**రెండు శతాబ్దాల నాటి ఆలయ చరిత్ర :**

సుమారు రెండు శతాబ్దాల క్రితం కలికిరి పంచాయతీ చెరువుముందరపల్లికి చెందిన వర్తకులు వ్యాపార నిమిత్తం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వేళ్లేవారని, అక్కడ కొనుగోలు చేసిన సరుకులను ఎడ్లబండి ద్వారా కలికిరి ప్రాంతానికి తీసుకువస్తున్నట్లు చరిత్ర చెబుతోంది. ఈ క్రమంలో వ్యాపారులు సరుకులు తరలిస్తున్న ఎడ్లబండి ఆలయ ప్రాంతంలోకి వచ్చి కదలకుండా నిలిచి పోయింది. వ్యాపారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ బండి ముందుకు సాగక పోవడంతో బండిలో ఉన్న బస్తాలను కిందకు దించుతుండగా వక్కల బస్తాలో అమ్మవారి విగ్రహం వెలుగులోకి వచ్చింది. దీంతో అమ్మవారిని అదే ప్రాంతంలో విగ్రహ ప్రతిష్ట చేయించి ఆలయం నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు కలికిరి గ్రామ దేవతగా అమ్మవారు కొలవబడుతున్నారు. పూర్వకాలంలో కలికిరి గ్రామ ప్రజలకు అంటురోగాలు వ్యాపించకుండా అమ్మవారు కాపాడినట్లు నానుడి. ఆలయం ఏర్పాటైన నాటి నుంచి కలికిరి రెడ్డివారిపల్లికి చెందిన రెడ్డివారి కుటుంబీకులు ఆలయ ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ అంచెలంచెలుగా ఆలయాన్ని అభివద్ధి చేపట్టారు. అలాగే ఉమ్మడిశెట్టి కుటుంబీకులు ఆలయ అర్చకులుగా వ్యవహరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఆషాఢమాసంలో అమ్మవారికి పెద్ద ఎత్తున తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.



గ్రామ దేవత ఎల్లమ్మ

# నడకతో ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్యం

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



స్వాస్థ వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న శ్రీఎం, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజూ 45-60 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు నడవడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మవిభూషణ్ శ్రీఎం(ముంతాజ్‌అలీ), సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నక్కలదిన్నె సత్సంగ్ ఫౌండేషన్ వద్ద స్వాస్థ వాకథాన్‌ను శ్రీఎం, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం సరైన ఆహారంతో పాటు తగినంత శారీరక శ్రమ తప్పనిసరి అన్నారు. నడక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా మానసిక స్థితిని మెరుగుపరుస్తుందన్నారు. రోజూ వాకింగ్ చేయడం వల్ల దీర్ఘకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నడక రక్తపోటును అదుపులో ఉంచడంతో పాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. నడకను దినచర్యలో భాగంగా చేసుకోవడం వల్ల మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. స్వాస్థ వాకథాన్ ర్యాలీ...సొసైటీకాలనీ, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా బెంగళూరు బస్టాండ్, తర్వాత నక్కలదిన్నె స్వాస్థ ఆస్పత్రికి చేరుకుంది. ర్యాలీలో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ, ఆరోగ్యమాత, సత్సంగ్ స్కూల్, స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులు, స్వాస్థ ఆస్పత్రి సిబ్బంది, సత్సంగ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మూడు సారారహిత గ్రామాలు



మొలకలదిన్నె గ్రామస్తుల సమక్షంలో సారారహిత గ్రామంగా ప్రకటిస్తున్న సీఐ భీమలింగ

మదనపల్లె రూరల్ : మండలంలోని మొలకలదిన్నె, పోతబోలు, సీటీఎం గ్రామాలను సారారహిత గ్రామాలుగా ప్రకటిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో స్థానిక వీఆర్వో, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామస్తులందరి సమక్షంలో సారా రహిత గ్రామాలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ భీమలింగ మాట్లాడుతూ.. సారా తయారీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా... ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సారాతో కలిగే లాభనష్టాలపై అవగాహన సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే సారా వండుతున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, విస్తృతంగా దాడులు నిర్వహించి, పాత ముద్దాయిలను, అనుమానితులను తహసీల్దార్ వద్ద బైండ్ ఓవర్ చేయించామన్నారు. గ్రామ, మండలస్థాయిలో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో సారా తయారీ, రవాణా, విక్రయాలు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఇక్పై సీటీఎం, పోతబోలు, మొలకలదిన్నె గ్రామాల్లో సారా సంబంధిత సమాచారం ఉందని, ఎవరైనా ఎక్సైజ్ అధికారులకు తెలపాలనుకుంటే టోల్ ఫ్రీనెంబర్ 14405కు లేదా ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సెల్ నెంబర్ 9440902533 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సారాను అరికట్టడంలో ప్రజలు ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుల్ టి.వీరనాగయ్య, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ, శివరాణి, గంగామహేశ్వరి, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పశువులకు టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

కలికిరి: పశువులకు తప్పసరిగా ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటమునినాయుడు అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామంలో ఆయన శుక్రవారం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పశువులు, లేగ దూడలకు ముద్దచర్మ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తోందని, ఈ వ్యాధి నుంచి పశువులను రక్షించుకోవడానికి టీకాలు వేయించాలన్నారు. మూడు నెలలు పైబడిన దూడలు, ప్రతి పశువుకు టీకాలు వేయించాలన్నారు. పశువైద్య సిబ్బంది ప్రతి గ్రామంలోనూ ఈ నెల ఆఖరులోపు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి, జేవీఏ ఆనంద, గోపాలమిత్ర లతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బల వ్యాధిపై జాగ్రత్తలు తీసుకోవాలి**

తంబళ్లపల్లె: పాడిపశువులకు వచ్చే బొబ్బలవ్యాధి పట్ల పాడి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్ర అన్నారు. శుక్రవారం తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో బొబ్బలవ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ఈనెల 31వతేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు జ్వరం, కన్ను, ముక్కుల నుండి నీరు కారడం జరుగుతుందన్నారు.దీంతో పాల దిగుబడి తగ్గుతుందన్నారు.ముందస్తుగా టీకాలు వేయాలన్నారు. నాలుగు నెలల దూడల నుంచి ప్రతి పశువుకు టీకా వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి

కలికిరి: కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ జాతరకు చాందినీ బండ్లు ఏర్పాటు చేసే భక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ రెడ్డిశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చాందినీ బండ్ల ముందు ఏలాంటి రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించరాదని, శాంతిభద్రతల దృష్ట్యా భక్తులు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

**ట్రాఫిక్ మళ్లింపు**

జాతరలో భక్తుల రద్దీ దృష్ట్యా ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. సోమల వైపు నుంచి వచ్చు బస్సు, లారీ వంటి వాహనాలు కందూరు నుంచి వల్లిగట్ల మీదుగా సదుం నుంచి పీలేరు వైపు వెళ్లాలన్నారు. కలికిరి నుంచి సోమలవైపు వెళ్లే పెద్ద వాహనాలు పీలేరు నుంచి సదుం మీదుగా వెళ్లాలన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

### విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రిని అందజేస్తున్న దాతలు

పీలేరురూరల్ : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ దేవలవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు విద్యాసామగ్రి వితరణ చేశారు. శుక్రవారం పులిచెర్ల మండలం అరవాండ్లపల్లెకు చెందిన సాంబశివనాయుడు, సుధాకర్‌నాయుడు, సుబ్రమణ్యం నాయుడు వారి తల్లి జ్ఞాపకార్థం సుమారు రూ. 7500 విలువైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వం పరిమళించింది

-యాచకుడికి దహన సంస్కరణలు



నివాళులు అర్పిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: మానవత్వం పరిమళించింది. స్థానిక వారపుసంతలో గుర్తు తెలియని ఓ యాచకుడు ఇటీవల మృతి చెందాడు. ఆస్పత్రి మార్చురీలో ఉన్న శవాన్ని బంధువులు, రక్తసంబంధీకులు ఎవరూ ముందు రాలేదు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు ముందుకు వచ్చారు. టు టౌన్ పోలీసులను సంప్రదించారు. శుక్రవారం ఆస్పత్రి మార్చురీలోని శవాన్నీ అంబులెన్సులో హిందూ శ్మశానవాటికకు తీసుకెళ్లారు. హిందూ సంప్రదాయబద్ధంగా దహనక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు ఆనంద్, కిరణ్, చైతు, చరణ్, ఫయాజ్ పాల్గొన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలి



ఏపీ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి

గుర్రంకొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పాఠశాలలోని వసతులను పరిశీలించారు. భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. పాఠశాలలో డ్రైనేజి సమస్య ఉందని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చాలారోజులుగా మరుగుదొడ్ల నుంచి మురుగునీరు సక్రమంగా వెళ్లడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఉన్న అద్దెభవనంలోనే తరగతి గదులను విభజించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. డ్రైనేజీ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామన్నారు. రేకుల షెడ్డులో ఉక్కపోత ఎక్కువగా ఉందని శాశ్వత భవన సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో ఉన్న వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**

కలకడ : హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కె.బాటవారిపల్లె బీసీ బాలుర వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంటగది, హాస్టల్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. 240 విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో 8 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 8 మరుగుదొడ్లు వినియోగానికి పనికి రాకుండా ఉన్నాయన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మునీంద్రనాయక్, వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య

మదనపల్లె సిటీ: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లె-1,2 డిపో పరిధిలో ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఐఆర్ ప్రకటించి, వెంటనే 12వ పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలన్నారు. రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 18 శాతం వడ్డీతో ఎస్‌ఆర్‌బిఎస్, ఎస్‌బిటి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. డబుల్ డ్యూటీ చేస్తున్న ఉద్యోగులకు డిడ అమౌంట్ పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3000 మందికి వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులు భర్తీ చేయాలన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేసిన తరువాతే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకం అమలు చేయాలన్నారు. ఈ పథకం సక్రమంగా అమలు చేయాలంటే సుమారు 3వేల బస్సులు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకత్వ గుర్తింపు కాలంలో తొమ్మిదిసార్లు వేతన సవరణ చేశారన్నారు. ఎప్పుడు వేతన సవరణలు చేసినా ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా ఇప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర నాయకులు విజయకుమార్, ఎస్‌పి.బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌బాబు, చంద్రశేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. వన్‌టు డిపో ఈయు గౌరవ అధ్యక్షుడిగా నాగూర్‌వల్లిని ఎన్నుకున్నారు.

# మేలైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి

పశుసంవర్ధకశాఖ ఏడీ నీరజ

పెద్దమండ్యం: మేలైన పోషకాలతో కూడిన పశుగ్రాసాన్ని పాడి ఆవులకు అందించడం ద్వారా పాడి రైతులు అధిక పాల దిగుబడి సాంధించవచ్చని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎస్. నీరజ అన్నారు. మండలంలోని వెలిగల్లులో శుక్రవారం ముద్దచర్మవ్యాధి టీకాల ప్రారంభం, పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుగ్రాసం నాటే పద్ధతి, నాటినప్పటి నుండి నీటి తడులు, కోతకు ఎన్నిరోజులు పశుగ్రాసం వస్తుందనే విషయాలను పాడి రైతులకు వివరించారు. పశుగ్రాసంలో ఉన్న రకాల గురించి రైతులకు తెలియజేశారు. ధాన్యపుజాతి, పప్పుజాతి గ్రాసాలను 3:1 నిష్పత్తిలో పశువులకు మేతగా ఇవ్వాలన్నారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ముద్దచర్మవ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి ఎస్ చరిత, సిబ్బంది మధు, దేవేంద్ర, గౌతమి, గోపాలమిత్ర మహేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

# అమ్మవార్లకు శాకంబరీ అలంకరణ



అమ్మవార్లకు శాకంబరీ అలంకరణ దృశ్యం

పెద్దతిప్పసముద్రం: ఆషాఢమాసంలో భాగంగా స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పార్వతీదేవి, లక్ష్మీదేవి, అన్నపూర్ణాదేవి అమ్మవార్లకు నిర్వహించిన శాకంబరీ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వందలాదిగా భక్తులు తరలి వచ్చి అమవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# లాభాల గంగమ్మకు పంచామృతాభిషేకం



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలోని జగనన్నకాలనిలో వెలసిన లాభాల గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి 35 రోజులు పూర్తి అయిందని, ఈ నెల 19, తేదీలలో 42 రోజులు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అంగరంగ వైభవంగా దీలు, బోనాల సమర్పణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త రామాంజులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ, సురేంద్రరెడ్డి, కుమార్, గణేష్, శ్రీనివాసులురెడ్డి, కార్పెంటర్ శీన, నరేష్, రెడ్డి రామాంజులు, గోకుల్ తదితరులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

# విద్యుత్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక



ఈఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

పీలేరు : పీలేరు డివిజన్ ఏపీఎస్పీడీసీఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పీలేరులో జరిగిన అసోసియేసన్ సమావేశంలో అధ్యక్షుడిగా బి.శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనకరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ. నాగరాజు, సెక్రటరీగా ఎం. హరినాథ్, ట్రెజరర్‌గా రాఘవయ్య, అడిషనల్ సెక్రటరీగా వి. రెడ్డిసాహెబ్, జాయింట్ సెక్రటరీలుగా వెంకటరమణ, ఖాదర్‌బాషా, ఆర్గనైసింగ్ సెక్రటరీలుగా రాజమ్మ, లక్ష్మీదేవి, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై ఈఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మదనపల్లె డివిజన్ సెక్రటరీ రాఘవేంద్రస్వామి పాల్గొన్నారు.

# కమ్యూనికేషన్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

రాయచోటి టౌన్ : నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకొంటేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఏఆర్‌డీఓటీ ఆర్టెక్ ఇన్ఫో బెంగుళూరు సంస్థకు చెందిన హెచ్‌ఆర్ రిక్రూటర్ జావిద్‌ఖాన్ పఠాన్ అన్నారు. శుక్రవారం రాయచోటి శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఆర్‌డీఓటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులు తమ చదువును పూర్తి చేసుకొని ఉద్యోగాల కోసం వెళితే మీరు కోరిన విధంగా ఉపాధి కానీ ఉద్యోగం కానీ లభించదన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడంతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాభివృద్ధితో విషయాన్ని ఎదుటి వారికి క్లుప్తంగా వివరణ ఇవ్వడం, ఆత్మన్యూనత భావాన్ని తొలిగించుకొని కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని అప్పుడే మీరు కోరిన స్థాయిలో ఉద్యోగం లభిస్తుందని చెప్పారు. అనంతరం కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై ఇస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.